
మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

*నారాయణపేట మండలం సింగారం చౌరస్తా-తిప్రాస్‌పల్లి రహదారిలో సుమారు 250కిపైగా హరితహారం మొక్కలు మంగళవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు కావాలని నిప్పు పెట్టారా..? లేక ప్రమాదవశాత్తు జరిగిందా? అనే విషయాలు తెలియాల్సి ఉన్నది. ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.*

*- నారాయణపేట రూరల్, ఏప్రిల్ 9*


# నమస్తే తెలంగాణ

# మహబూబ్‌నగర్

## నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, బుధవారం 10 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET







జూరాల ప్రాజెక్టు వద్దడె డ్‌స్టోరేజీకి చేరిన నీటి మట్టం



కరువు కోరల్లో పాలమూరు

# జల గండం

- పడిపోతున్న భూగర్భ జలాలు
- చాలా మండలాల్లో పాతాళానికి..
- డెడ్ స్టోరేజీ దిశగా జూరాల డ్యాం
- తేలిన రాళ్లు, రప్పలు.. కనిపించని నీటిజాడ
- అదే బాటలో మిగతా ప్రాజెక్టులు
- క్రాప్ హాలీడే ప్రకటించిన అధికారులు
- వట్టిబోయిన బోర్లు, బావులు
- సాగునీళ్ల లేక ఎండుతున్న పంటలు
- రైతుల కష్టం.. పశువులకు మేతగా..
- ఉమ్మడి జిల్లాలో తాగునీటికీ కటకట

***ఉమ్మడి జిల్లాను కరువు కమ్ముకున్నది. సాగు, తాగునీరు లేక డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. జీవనది అయిన కృష్ణమ్మ నీటి ప్రవాహం లేక బోసిపోతున్నది. రాళ్లు, రప్పలు తేలి నీటి జాడే కనిపించడం లేదు. జూరాల డ్యాం డెడ్ స్టోరేజీకి చేరింది. మిగతా ప్రాజెక్టులు, రిజర్వాయర్లు వట్టిబోతున్నాయి. ఇప్పటికే ప్రాజెక్టుల ఆయకట్టుకు అధికారులు క్రాప్‌హాలీడే ప్రకటించారు. నీళ్లులేక కాల్వలు బోసిపోయాయి. బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. నీళ్లు లేక పంటలు చేతికి రావడం లేదు. వరి పొలాలు నెర్రెలు బారుతున్నాయి. ఓ వైపు పొలం ఎండుతుంటే.. మరో వైపు రైతన్న గుండె పగులుతున్నది. రైతు కష్టం మేకలకు మేతగా మారుతున్నది. మరోవైపు పలు పల్లెలు దాహార్తితో అలమటిస్తున్నాయి. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో జలగండ'మే' అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.***

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, ఏప్రిల్ 9*


గద్వాలము న్సిపాలిటీలో బోరుబిగి స్తున్నఅధి కారులు

## ఎటుచూసినా ఎండమావే..

గద్వాల, ఏప్రిల్ 9 : పదేండ్లు పచ్చని పైర్లతో కోనసీమను తలపించేలా కళకళలాడిన ఉమ్మడి పాలమూరు.. నేడు నెర్రెలు బారిన నేలలు, తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద బిందెలతో కుస్తీలు పట్టే పరిస్థితి దాపురించింది. ప్రాజెక్టు నీళ్లతో జలసవ్వడులు చేసిన కాల్వలు నేడు వట్టిపోయి కళావిహీనంగా మారాయి. వానాకాలంలో సరైన వర్షాలు కురవకపోగా, భూగర్భజలాలు సైతం అడుగంటడంతో సాగునీరు లేక రైతులు, అటు తాగునీటి కోసం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాకు సాగు,తాగునీటికి వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం వట్టిపోయే దశకు చేరుకున్నది. దీంతో జిల్లా ప్రజలకు తాగునీటి గండం తప్పేటట్లు లేదు. ఇప్పటికే జూరాలలో నీరు లేక కుడి,ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టుకు అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించడంతో చాలా వరకు రైతులు పంటలు సాగు చేయలేదు. ఈ ఏప్రిల్ మాసంలో ప్రజలకు తాగునీటి గండం తప్పేలా లేదు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే కర్ణాటక మాదిరిగా నీటి కోసం ప్రజలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన దుస్థితి నెలకొనే పరిస్థితులు రాకమానవు. ప్రస్తుతం జూరాలలో నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా, 3.546 టీఎంసీలు డెడ్ స్టోరేజీలో ఉంది. మిగిలిన నీటిని మాత్రమే గ్రావిటీ ద్వారా విడుదల చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 3.546 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నది. దీంతో ప్రజలు తాగు నీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్నది.

***పదేండ్ల కిందటి కరువు పునరావృతం..***

ఎగువన వర్షాలు సరిగా కురువని కారణంగా ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. 2016లో జూరాల ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకోగా, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, అచ్చంపేట పట్టణాలకు తీవ్ర నీటి ఇబ్బంది ఏర్పడింది. దీంతో ప్రత్యేకంగా మోటర్లు ఏర్పాటు చేసి డెడ్‌స్టోరేజీలో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం తరలించారు. ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి జిల్లాలో తాగు నీటి అవసరాలకు ఏడాదికి ఎండ తీవ్రత ఆవిరి రూపంలో వెళ్లే నీటిని కలుపుకొని 1.50 టీఎంసీలు అవసరం. ప్రతి రోజూ 74 ఎంఎల్‌డీలు అవసరమున్నట్లు మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూరాల జలాశయం పూర్తిగా అడుగంటిపోగా డెడ్‌స్టోరేజీతో కలిపి 3.546 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నది. ప్రస్తుతమున్న నీరు ఏప్రిల్ 15వరకు తాగునీటికి సరిపోయే అవకాశం ఉన్నది. ఆ తర్వాత ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పనిసరి కానున్నాయి. గతేడాది మార్చిలో జూరాల ప్రాజెక్టులో 4.262 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఈ ఏడాది మార్చిలో అది కాస్త 3.546కు తగ్గిపోయింది.

***చందాలు వేసుకొని బోరు రిపేరు..***

వేసవి ఆరంభంలోనే తాగునీటి ఎద్దడి మొదలైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయిజ మండలం రాజాపూర్, చిన్నతాండ్రపాడ్ గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. సంకాపురంలో ప్రజలకు నీటి ఇబ్బందులు ఏర్పడగా, గ్రామస్తులు చందాలు వేసుకొని బోరు రిపేరు చేయించుకున్నారు. గద్వాల మండలం జంగంపల్లి, పూడూరు, సంగాల పట్టణ సమీపంలోని జమ్మిచేడు, గట్టు మండలం ఆలూరు, అలంపూర్ పట్టణంలో నీటి ఎద్దడి నెలకొనడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారు. అధికారులు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే పరిస్థితి మరింత తీవ్రతరం కానున్నది. ప్రస్తుతం గ్రామ, పట్టణాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతిపంపుల మరమ్మతులు, బోర్లుఫ్లసింగ్ వంటి పనులు చేపడుతున్నారు. వీటి ద్వారా కూడా ప్రజలకు నీటి కష్టాలు తీరేటట్లు కనిపించడం లేదు.


జమ్మిచేడులో ట్యాంకర్ వద్ద నీటి కోసం పాట్లు పడుతున్న మహిళలు


బీచుపల్లి వద్ద కృష్ణానదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో తేలిన రాళ్లు

## బోసిపోయిన కృష్ణమ్మ

ఇటిక్యాల, ఏప్రిల్ 9 : బీచుపల్లి క్షేత్రం వద్ద ప్రవహించే కృష్ణమ్మ నీళ్లు లేక వెలవెలబోతున్నది. ఐదారేండ్లుగా ఎన్నడూ లేనివిధంగా ప్రవాహం అడుగంటడంతో నదిలో రాళ్లు తేలాయి. రాష్ట్ర నలుమూలల నుంచి అస్థికలు నదిలో కలిపేందుకు వచ్చేవారు నీరు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొంతమంది భక్తులు నదిలో రాళ్లు దాటుకుంటూ కొండపేట వద్ద నదిలో గల చిన్నమడుగులో ఉన్న కాస్త నీటిలో స్నానాలు చేసి అస్థికలను కలుపుతున్నారు. రాబోవు రోజుల్లో నిర్వహించే ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శ్రీరామనవమి, అంజన్న బ్రహ్మోత్సవాలకు నీటి కష్టాలు తప్పేలా లేవంటున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి షవర్‌బాత్‌కు ఏర్పాట్లు చేపడుతామని కార్యనిర్వహణ అధికారి రామన్‌గౌడ్ తెలిపారు.

## తడి కోసం తంటాలు

- వట్టిపోయిన చెరువులు, కుంటలు, కాల్వాలు
- నెర్రెలు బారిన పొలాలు
- కండ్లముందే ఎండుతున్న పంటలు



గోపాల్‌పేట, ఏప్రిల్ 9 : యాసంగిలో సాగు చేసిన వరి పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ఎటుచూసినా చెరువులు, కుంటలు, కాల్వలు వట్టిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీళ్లు తగ్గాయి. దీంతో ఎండుతున్న పంటలకు నీళ్లు అందించేందుకు రైతులు ట్యాంకర్లతో నీటిని పారించుకునే పరిస్థితి దాపురించింది. పంట చేతికొచ్చే దశలో నెర్రెలు బారిన పొలాలు, ఎండుముఖం పట్టిన పంటను చూసి రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేసినా ఫలితం లేకపోయింది. పెట్టుబడి అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. చేసేదేమీలేక ఎండిన పంటను జీవాలకు మేతగా వదిలేస్తున్నారు. గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లో చెరువులు, కుంటలు, బోరుబావుల కింద యాసంగిలో 15,363 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారుల అంచనా. మున్ననూర్‌లో 660 ఎకరాల్లో వరి సాగు చేయగా పంట చేతికొచ్చే దశలో ఉన్నది. కేఎల్‌ఐ, ఎంజీకేఎల్‌ఐ కాల్వ, చెరువులు, కుంటలు వట్టిపోవడంతో కొద్దిపాటి బోర్లు, ట్యాంకర్ల ద్వారా పంటకు చాలీచాలని నీళ్లు అందిస్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ట్యాంకర్‌తో నీళ్లు పడుతున్నాం..

బోరు కింద నాలుగున్నర ఎకరాల్లో వరి పంట వేశాను. రూ.లక్షకుపైగా పెట్టుబడి అయ్యింది. పంట చేతికొచ్చే దశలో బోరు నుంచి నీళ్లు తక్కువగా వస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియక ట్యాంకర్ ద్వారా పంటకు నీళ్లు పెడుతున్నా. ఒక్కో ట్యాంకర్‌కు సుమారు రూ.400 ఖర్చు అవుతున్నది. సమీపంలోని రైతుల బోర్ల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నాను. దీంతో పాటు పక్క రైతుల బోర్ల నుంచి నా పొలం వరకు పైపులైన్ వేశాను. పైపుల కోసం రూ.50 వేల వరకు ఖర్చు చేశా. చాలీచాలని నీటితో ఎండిన పొలం పారాలంటే కష్టంగా ఉన్నది. పంటను కాపాడుకునేందుకు నానా యాతన పడుతున్నాను. రెండు ఎకరాలన్నా బయటపడుతుందేమో అనే ఆశతో పంటకు నీళ్లు పెడుతున్నా.

*- రమేశ్, రైతు, మున్ననూర్, గోపాల్‌పేట మండలం*

### నీళ్లు సాలక కన్న కష్టాలు..



యాసంగిలో బోరు కింద రెండెకరాల్లో వరి నాటిన. ఎండలు ఎక్కువై బోర్ల నీళ్లు తక్కువైనవి. పంటను కాపాడుకునేందుకు మరో బోరు వేయించిన. అది కూడా సన్నగా నీళ్లు పోస్తుంది. అవి దేనికీ సరిపోవడం లేదు. ఇంతవరకు కేఎల్ఐ కాల్వ నీళ్లు పుష్కలంగా వస్తుండే. బోర్లు కూడా బాగా పోస్తుండే. భూమిల నీళ్లు లేక బోర్లు తగ్గినై. ఏసిన పంట చేతికొచ్చేటట్లు లేదు. నోటికాడికి వచ్చిన పంట ఎండిపోతుంటే నిద్ర పడ్తలేదు. పంట పెట్టుబడి, చేసిన కష్టం మీద పడేటట్లు ఉంది. సర్కారు పంట నష్టాన్ని గుర్తించి రైతులను ఆదుకోవాలి.

*- గోకారి ఉద్దాలు, రైతు, మున్ననూర్*

### కాల్వ నీళ్లతో కష్టాలు లేకుండే..



కేఎల్ఐ కాల్వ నీళ్లు వస్తున్నప్పుడు ఇన్ని కష్టాలు లేకుండే. మూడు బోర్ల కింద రెండెకరాల్లో వరి, రెండెకరాల్లో కూరగాయలు సాగు చేశా. బోర్లలో నీళ్లు తగ్గి పంటలకు తడి సరిపోవడం లేదు. కాల్వ నీళ్లు రాకపోగా, ఉన్న బోర్లలో నీళ్లు తగ్గిపోయి నిరాశే మిగిలింది. వరి ఎండుముఖం పట్టింది. కూరగాయల పంటకు నీళ్లు సాలక ఇప్పటికే ఎకరా వదిలిపెట్టిన. ఇంతవరకు ఇట్ల ఎప్పుడూ జరుగలే. బోర్ల నీళ్లు సాలకుంటే కాల్వల నీళ్లు పుష్కలంగా ఉంటుండే. పంట నష్ట పరిహారం అందిస్తే మాకు మేలు జరుగుతుంది.

*- అడ్డాకుల వెంకటయ్య, రైతు, మున్ననూర్*

# మళ్లీ మొదటికొచ్చింది..

- కేసీఆర్ ప్రభుత్వంలో ఎనిమిదేండ్లుచిం తలేకుండా నీళ్లొచ్చినయ్
- నేడు ఎండుతున్న పంటల చూసి రైతన్న ఆందోళన
- పాతాళానికిపడి పోయిన భూగర్భజలాలు
- పంటలవివ రాలు నమోదు చేయని అధికారులు


కేటీదొడ్డి శివారులో ఎండిన వరి పంటను మేస్తున్న గొర్రెలు

కేటీదొడ్డి, ఏప్రిల్ 9 : ఎనిమిదేండ్లు చింత లేకుండా సాగిన సాగు సంబురం నేడు ఎండిన పంటలతో రైతన్న కండ్లల్లో నీళ్లు తెప్పిస్తున్నవి. ఉమ్మడి ధరూర్ మండలంలో కరువు తాండవం చేస్తున్నది. పదేండ్లలో వరిపంటను రైతులు సంబురంగా సాగు చేశారు. ఒక్కో రైతు పంటకాలంలో 200 నుంచి 300 సంచుల ధాన్యం పండించేవారు. ఈ ఏడాది యాసంగి మాత్రం పంటలన్నీ ఎండిపోయాయి. ఒక్క ఎకరాకు సుమారు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టగా, కనీసం అవి కూడా రావడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుకు అంతో ఇంతో అండగా నిలిచే పెట్టుబడి సాయానికి కూడా కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెడుతుండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కేటీదొడ్డి మండలంలో ఎండిన పంటల వివరాలపై వ్యవసాయ అధికారిని వివరాలు అడిగేందుకు సంప్రదించగా, ఎన్నికల విధుల్లో ఉన్నామని తెలిపారు.

***పాతాళానికి పడిపోయిన జలం..***

కాల్వలు, చెరువుల్లో నీళ్లు లేక బోర్లన్నీ ఇంకిపోయాయి. ఎనిమిదేండ్లుగా కాల్వలకు నీరు వస్తుండటంతో భూగర్భజలాలు పుష్కలంగా ఉండేవి. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో చెరువులు ఎండి భూగర్భజలాలు అడుగంటిపోయాయి. పంటలు కాపాడుకోవాలని కొందరు రైతులు అప్పు తెచ్చి మరీ బోర్లు వేస్తున్నా ఫలితం లేకుండా పోతున్నది. ఇలాగే కొనసాగితే పాత రోజులు మళ్లీ వస్తాయని, వలసలు తప్పవని చర్చించుకుంటున్నారు.


కేటీదొడ్డి శివారులో ఎండిన వరి పంట

### మూడెకరాల పంట ఎండిపోయింది..



సాగునీళ్లు లేక బోర్లలో నీళ్లు ఇంకిపోయినయ్. రైతుబంధు పైసలు కూడా పడలేదు. కాల్వ పోంటి నీళ్లొస్తే మా పంట పండేది. నీళ్లలేక పంటలు ఎండిపోయాయి. రైతుల పాలిట దేవుడు కేసీఆర్. ఆయన పాలనలో నీళ్లు, కరెంటుకు ఇబ్బంది లేకుండే. కాంగ్రెస్ సర్కారొచ్చినంక కష్టాలు మొదటికొచ్చినయి. పంటనష్టపోయిన రైతులకు పరిహారమియ్యాలె.

*- అంజమ్మ, రైతు, ఉమిత్యాల, గద్వాల జిల్లా*

### కేసీఆర్ హయాంలో దర్జాగా బతికాం..




కేసీఆర్ హయాంలో దర్జాగా బతికాం. సాగు, తాగునీటికి చింతలేకుంటుండే. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి కరెంటు కష్టాలు మొదలయ్యాయి. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను పట్టించుకుంటలేదు. రైతుబంధు లేదు, నీళ్లు లేవు, కరెంటు లేదు. కాల్వల్లో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి. ఎండిన పంటలను అధికారులు కనీసం పరిశీలిస్తలేరు. ఇలాంటి వారిని ఇంకోసారి నమ్మం.

*- మణెమ్మ, రైతు, ఉమిత్యాల, గద్వాల జిల్లా*

# చెదిరిన చేదుడుబావులు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 9 : చేదుడు బావులు.. ఈ పేరు వింటే పూర్వపు రోజులు గుర్తుకొస్తాయి. బోరుబావులు లేని సమయంలో ఎటుచూసినా చేదుడుబావులే కనిపించేవి. ఈ బావుల్లో మట్టి ద్వారా వచ్చే నీళ్లు స్వచ్ఛతతోపాటు ఖనిజ లవణాలు పుష్కలంగా లభించి ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూర్చేవి. నాడు భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ఉబికి వచ్చే నీటితో తాగు, ఇతర అవసరాలను వినియోగించుకునేవారు. కాలక్రమేణా బోరుబావులు వినియోగంలోకి వచ్చాయి. దీంతో భూగర్భజలాలు తగ్గిపోవడం, ఫిల్టర్ వాటర్, ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేపడుతున్నా నీటి శుద్ధి లేకపోవడంతో వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మక్తల్‌లోని నాగేశ్వర స్వామి ఆలయంలో చేదుడుబావి పూడుకుపోయింది. ఇదే మండలంలోని భూత్పూర్ గ్రామంలో ఇంకా చేదుడుబావిని వినియోగిస్తున్నారు. కాగా, నేటి తరానికి వీటి జాడేలేదు. అక్కడకక్కడా కొన్ని గ్రామాల్లో ఉన్నా వాటిని పూడ్చివేయడం, కొన్ని చోట్ల చెత్తా చెదారం వేసేందుకు వినియోగిస్తున్నారు.


భూత్పూర్‌లోనిచేదు డుబావి